# ఆధ్యాత్మిక చింతనలో యువత

- **దిన దినాభివృద్ధి చెందుతున్న భక్తిభావం**
- **కిటకిటలాడుతున్న పుణ్యక్షేత్రాలే ఇందుకు నిదర్శనం**
- **టీఆర్ఎస్ నేత కెప్టెన్ లక్ష్మీకాంతరావుతో 'టీ మీడియా' ప్రత్యేక ఇంటర్వ్యూ**

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 3 (టీ మీడియా): ''ఆధ్యాత్మిక చింతన తగ్గలేదు. తగ్గినట్లుగా కనిపిస్తోంది. గుళ్లు, గోపురాలు కిటకిటలాడుతున్నాయి చూడండి'' అని



అంటున్నారు.. కెప్టెన్ లక్ష్మీకాంతరావు. రాజకీయాల్లో బిజీగా ఉంటూనే ఆధ్యాత్మిక మార్గాన్ని విడువని ఆయన.. ఇటీవల మహాకుంభమేళాను కూడా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన భక్తి, ముక్తి, పుణ్యం, పురుషార్థాలపై 'టీ మీడియా'తో మాట్లాడారు.

**టీ మీడియా: ప్రజల్లో ఆధ్యాత్మిక చింతన తగ్గుతోందా?**

తగ్గడం లేదు.. పెరుగుతోంది. యువత కూడా ఆధ్యాత్మికం వైపే అడుగులేస్తోంది. సమాజంలో ఆధ్యాత్మిక చింతన పెరుగుతోంది. డబ్బు, సంపాదన తృష్ణ పెరిగినా భక్తిభావం తగ్గలేదు. ఆలయాలకు వెళ్లి ఓ పదిహేను నిమిషాల పాటు అన్నీ మరిచిపోయి భగవరాధనలోనే లీనమవుతున్నారు.

**టీ.మీ.: తగ్గిందని జరుగుతున్న ప్రచారం?**

భక్తి తగ్గిందని అనడానికి బహిర్గతంగా కనిపిస్తున్న నేరాలు, విశృంఖలత్వం ఓ కారణం. మీడియాలో హత్యలు, అత్యాచార వార్తలకు ప్రాధాన్యం పెరగడం వల్ల సమాజం ఇలాగే ఉందని భ్రమపడుతున్నాం. ఆ భావన అసత్యం. గుడిని చూడకుండా వీధుల్ని చూసి ఈ సమాజాన్ని అంచనా వేయడం అశాస్త్రీయం.

**టీ.మీ.: టెంపుల్ టూరిజంతో ప్రయోజనం ఏమిటి?**

ఆలయాలను దర్శించుకునే భక్తులకు సౌకర్యాలు కల్పించేలా ఉండాలి. కానీ ఆలయాల సమీపంలో వ్యాపార దృక్పథంతో ఇతర వినోదాలకు అవకాశం ఇవ్వకూడదు. ఆలయాల సమీపంలో ఏ కార్యక్రమం నిర్వహించినా అది సంస్కృతి, సంప్రదాయబద్ధంగానే ఉండాలి. వ్యాపార దృక్పథం లేకుండా టెంపుల్ టూరిజం వస్తే అందరూ ఆనందిస్తారు.. కానీ భక్తిని మరిచి రక్తికట్టించే కార్యకలాపాలతో వ్యాపారాలు నిర్వహిస్తే ఆలయాల పవిత్రతకు భంగం కలుగుతుంది.

**కుంభమేళా అనుభూతులేమిటి?**

భారతీయ సమాజంలో హిదూ భావనలు ఎంతగా వేళ్లూనుకుని ఉన్నాయో. హిందూ ధర్మాన్ని ప్రజలెలా ఆచరిస్తున్నారో మహాకుంభమేళా మరోమారు రుజువుచేసింది. ఈ కుంభమేళాలో 12 కోట్లమంది పాల్గొన్నారు. ఇంతటి సువిశాల దేశంలో సుదూర ప్రయాణం చేసి పది శాతం జనాభా తరలి రావడం గొప్ప విషయం. హిందువులందరూ గర్వపడేలా జరిగే వేడుకలో పాల్గొన్నందుకు ఎంతగానో సంతోషిస్తున్నా.